క్లుప్తంగా

ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ



క్రోసూరు: క్రోసూరులోని మండల పరిషత్ అభివృద్ధి సమావేశం హాలులో శనివారం ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. అధ్యక్షత వహించిన ఎంపీడీవో బి.మహేష్‌బాబు మాట్లాడుతూ.. తొలివిడతగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ పి.కోటయ్య, పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, వెలుగు ఏపీఎం కృపావేణి, వయోజన విద్య సూపర్‌వైజర్ శిరీష, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు పింఛన్లు పంపిణీ



సత్తెనపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న ఇరువురు రోగులకు శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన ఎడ్లూరి జ్యోతి కిడ్నీ వ్యాధితో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. పంపిణీ బాధ్యురాలైన మహిళా పోలీస్ బాణావత్ నాగలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి రూ.15 వేల పింఛను మొత్తం అందించారు. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన దివ్యాంగుడు పేరిపోగు శ్రీనివాసరావు పక్షవాతం రావడంతో గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు రూ.6 వేలను సచివాలయ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసాచారి అందించారు.

మాలధారుల సేవలో శ్రీ అయ్యప్ప సేవా సమితి



క్రోసూరు: క్రోసూరులోని శ్రీ అయ్యప్ప సేవా సమితి శనివారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు అయ్యప్ప మాలధారులకు భిక్ష వితరణ కార్యక్రమం చేపట్టింది. స్థానిక వీరభద్ర మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. 12 సంవత్సరాలుగా ఈ సేవ చేస్తున్నారు. అయ్యప్ప స్వామి, కుమారస్వామి, వినాయకుడి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేసి భజనలు, కీర్తలను ఆలపించారు.

సత్తెనపల్లి: మాల ధరించిన స్వాములకు పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో భిక్ష వితరణ కార్యక్రమం శనివారం రాత్రి ప్రారంభించారు. స్వాములకు ప్రతి రోజు సాయంత్రం 7 గంటల నుంచి భిక్ష కార్యక్రమం జరుగుతుందని ఆశ్రమం వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ తెలిపారు. డిసెంబర్ 2వ వరకు దీనిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. సేవ చేయదలచుకొన్న వారు ఆశ్రమం వద్దకు రావాలని కోరారు.

వలంటీర్లకు శిక్షణ



రాజుపాలెం: నిరక్షరాస్యులకు రాత్రి వేళల్లో ఓపికగా చదువు నేర్పాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీరు ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. సంతకం చేసేలా, అక్షరాలను గుర్తించే విధంగా నేర్పాలని తెలిపారు. జీవన, వృత్తి నైపుణ్యాల పెంపు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునశర్మ, ఏపీఎం శివకుమార్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు ప్రారంభం



సత్తెనపల్లి: గుంతలు లేని రోడ్లతో ప్రమాదాల నివారణ సాధ్యమని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పాకాలపాడు–రెంటపాళ్ళ మార్గంలో రూ. 10 లక్షలతో రహదారి ప్యాచ్ వర్క్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. ఆర్ అండ్ బీ డీఈ శివయ్య మాట్లాడుతూ.. సత్తెనపల్లి, ముప్పాళ్ల మండలాల్లో రూ. 55 లక్షలతో రహదారుల మరమ్మతులు జరగనున్నాయని తెలిపారు.

పథకం ఘనం.. తీరదు దాహం!


- తాగునీటి సమస్య తీర్చని పలు పథకాలు
- అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు
- గుక్కెడు నీటికీ ప్రజలకు నిత్యం తప్పని కష్టాలు

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేక నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్మించిన కొద్ది నెలలకే మూలకు చేరుతున్నాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఆర్వో ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేయక తప్పని దుస్థితి నెలకొంది. అధికారులు మాత్రం అంతా సవ్యంగానే ఉన్నట్లు, నిర్వహణ జరుగుతున్నట్లుగా రికార్డులో నమోదు చేసుకొని ఖర్చులు చూపుతున్నారు.

ముప్పాళ్ళ: మండల కేంద్రంలో 20 ఏళ్ల క్రితం రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఆరంభంలో ముప్పాళ్ళతోపాటుగా చాగంటివారిపాలెం గ్రామానికి పైపు లైన్లు ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. నిర్వహణ భారం కావటంతోపాటుగా పంచాయతీల పునర్విభజన జరగటంతో పథకం మూలకు చేరింది. దమ్మాలపాడులో ఐదు గ్రామాలకు రక్షిత నీరు అందించేందుకు రూ.2 కోట్లు వెచ్చించి పైలట్ ప్రాజెక్ట్ నిర్మించారు. ఆ మేరకు దమ్మాలపాడు, తురకపాలెం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, బొల్లవరం, కొంకావారిపాలెం గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించారు. పూర్తి స్థాయిలో తాగు నీరు సరఫరా కాకపోయినా, ఏడాది తర్వాత పథకం నిర్వహణ సరిగ్గా లేకపోవటంతో నిరుపయోగంగానే మారింది. గోళ్లపాడులోని ఓవర్‌హెడ్ ట్యాంకు మెట్లు విరిగిపోయాయి. కొన్ని గ్రామాలలో పంచాయతీ నిధులతో ట్యాపులు నిర్మించారు. పూర్తి స్థాయిలో పైపు లైన్లు ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు పైపు లైన్లు కూడా దొంగల పాలయ్యాయి. ఫిల్టర్‌బెడ్‌లు పూర్తిగా పాడైపోయాయి. పెద్ద మొక్కలు పెరిగి ఆ ప్రాంతాలు చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. పథకం పూర్తిగా నిరుపయోగంగా మారిపోయింది. కుందురువారి పాలెంలో పథకానికి అవసరమైన పైపులలో నీరు సరఫరా కాకుండానే తొలగించారు. మాదల గ్రామంలోని శివారు కాలనీలకు రక్షిత తాగునీరు అందని ద్రాక్షగానే మారింది. ఏళ్ల తరబడి



ముప్పాళ్ళలో పిచ్చి మొక్కలతో నిండిన ఓవర్ హెడ్ ట్యాంక్



దమ్మాలపాడులో ఉపయోగపడని పైలట్ ప్రాజెక్ట్



చాగంటివారిపాలెంలో నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంక్

పైపు లైన్లు లేకపోవటంతో బావుల్లోని నీటినే తాగేందుకు ఉపయోగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పలుదేవర్లపాడు, ఇరుకుపాలెం, మాదల, బొల్లవరం గ్రామాలలోని ఎస్సీ కాలనీలకు రక్షిత నీరు కలగానే మిగిలింది.

నిధులు మాత్రం భారీగా ఖర్చు

పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు ప్రతి పంచాయతీకి ఏటా ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తున్నారు. ఒక్కొక్క పంచాయతీలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం పైపులైన్లు మరమ్మతులకు, ఇతర అవసరాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా ప్రజలకు రక్షిత నీరు అందించటంలో మాత్రం అధికారులు సఫలీకృతం కాలేకపోతున్నారు.

కుళాయిల ద్వారా నీరు అందించాలి



ఓవర్ హెడ్ ట్యాంకు రిపేరు చేసి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలి. క్యాను రూ.5 చొప్పున తాగునీరు కొని తెచ్చుకుంటున్నాం. ఓవర్‌హెడ్ ట్యాంకు అంతా పిచ్చి మొక్కలతో నిండింది. అయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

– మన్నం చినకోటేశ్వరరావు, ముప్పాళ్ళ

పైలట్ ప్రాజెక్ట్ నిర్వహణకు టెండర్లు

దమ్మాలపాడు గ్రామంలోని పైలట్ ప్రాజెక్ట్ నిర్వహణకు టెండర్లు పిలిచాం. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా అన్ని గ్రామాల్లోని ఎస్సీ కాలనీలకు పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నాం. రెండు గ్రామాల్లో ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ముప్పాళ్ళలోని పథకం ద్వారా తాగు నీరు అందించేందుకు మైక్రోఫిల్టర్ల ఏర్పాటుకు ఎంపీ నిధుల మంజూరు కోసం ఎదురు చూస్తున్నాం.

–ఎస్‌కే ఉమర్ ఫరూఖ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ముప్పాళ్ళ

అడ్డగోలు డ్యూటీలను రద్దు చేయాలని వినతి



పెదకూరపాడు(అమరావతి): గ్రామ రెవెన్యూ సహాయకులకు నిబంధనలకు విరుద్ధంగా వేసిన అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని పల్నాడు జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వీఆర్‌ఏలతో కలిసి తహసీల్దార్ డానియేలుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 4న నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘ మండల ప్రధాన కార్యదర్శి ఖాసిం, జాయింట్ సెక్రటరీ ఏడుకొండలు, సుశీల, రామారావు, ప్రసాద్, శ్రీను, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

నాదెండ్ల: సబ్సిడీపై రైతులకు ఇస్తున్న శనగలను సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ చెప్పారు. మండలంలోని సాతులూరు రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ ముసుగు శోభారాణి చేతుల మీదుగా రైతులకు 80 క్వింటాళ్ల శనగలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1115 క్వింటాళ్లు కేటాయించారని, మొదటి విడతగా 400 క్వింటాళ్లు అందాయని, సాతులూరు గ్రామానికి 80 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. కావలసిన రైతులు పాసుపుస్తకం జిరాక్సు, ఆధార్ కార్డుతో రావాలని కోరారు. ఏఈవోలు రామారావు, వేణుగోపాల్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న ఏడీఏ శివకుమారి

క్రోసూరు: రైతు సేవా కేంద్ర సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్రోసూరు-1 రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, రాజుపాలెం, అమరావతి మండలాల వారు పాల్గొన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎం.శివకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శివకుమారి మాట్లాడుతూ... కలుపు మొక్కలను సమర్థంగా, సకాలంలో నిర్మూలించకపోతే దిగుబడులపై ప్రభావం పడుతుందన్నారు. కలుపు మొక్కల నివారణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు కె.అమల కుమారి మాట్లాడుతూ.. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడితే నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఖర్చు పెరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతుల గురించి వీడియోలను ప్రదర్శించారు. క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, సత్తెనపల్లి ఉద్యాన అధికారి డి.నవీన్, వ్యవసాయ అధికారులు వి.వేణుగోపాల్ (క్రోసూరు), డి. కృష్ణయ్య (బెల్లంకొండ), పీవీ.నరసయ్య (రాజుపాలెం), పి. పెదవెంకటేశ్వర్లు (అచ్చంపేట), షేక్ ఫకీర్ అహ్మద్ (అమరావతి), రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిరప 'ప్రకృతి సాగు' లాభదాయకం



నార్నెపాడులో మిరప సాగును పరిశీలిస్తున్న నందకుమార్, పూజ

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మిరప సాగు చేయటం వల్ల ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఫీల్డ్ అసిస్టెంట్ నందకుమార్ చెప్పారు. ఎంతో కష్టమైన నల్లతామర చాలా సులభంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మిరప పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ విధానంలో మిరపలో అంతర పంటగా ఉల్లి, బంతి, ముల్లంగి, క్యారెట్, కొత్తిమీర వేసుకోవటం వల్ల నల్ల తామర అరికట్టవచ్చన్నారు. రైతులు జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు వాడటం వలన ఖర్చు తగ్గుతుందని తెలిపారు. పీఎండీఎస్ 30 రకాల విత్తనాలు వేసుకోవడం వల్ల అధిక లాభాలు పొందుతున్నామని మహిళా రైతు కొర్రపాటి శిరీష తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ కె.పూజ, ఐసీఆర్‌పీ కె.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కొమెరపూడిలో శాంతి కమిటీ ఏర్పాటు



ఇరు వర్గాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి: అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఇటీవల జరిగిన గొడవల నేపథ్యంలో శనివారం రాత్రి గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ.. అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులు నమోదైతే భవిష్యత్తులో ఎన్నో నష్టాలు ఉంటాయని గుర్తుచేశారు. కనుక ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి, ఎలాంటి అల్లర్లు జరగకుండా సహకరించాలని కోరారు. సత్తెపల్లి రూరల్ ఎస్‌హెచ్‌ఓపీ శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ ఎస్‌ఐ షేక్ అమీనుద్దీన్‌లు మాట్లాడారు. ఎలాంటి గొడవల్లో ఇకపై పాల్గొనకుండా ఉంటామని వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన



మృతదేహంతో ఆందోళన చేపట్టిన దృశ్యం

చిలకలూరిపేటటౌన్: ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ పాప మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన సంఘటన శనివారం రాత్రి పట్టణంలో జరిగింది. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ వలి, అల్లీమా దంపతుల 11 నెలల కుమార్తె అక్ష అస్వస్థతకు గురికావడంతో శుక్రవారం ఉదయం స్థానిక ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని రైతు బజార్ సమీపాన ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే పాప పరిస్థితి మరింత క్షీణించిందని, మెరుగైన వైద్యం కోసం వెంటనే గుంటూరు తీసుకెళ్లాలంటూ వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు వెంటనే పాపను అంబులెన్స్‌లో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే పాప మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆగ్రహించిన పాప కుటుంబ సభ్యులు, బంధువులు భారీగా పట్టణంలోని హాస్పిటల్ వద్దకు శనివారం చేరుకుని ఆందోళన చేపట్టారు. పట్టణంలోని వైద్యం చేసిన హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ చనిపోయిందంటూ పాప కుటుంబ సభ్యులు ఆరోపించారు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ పి రమేష్ సిబ్బందితో అస్పత్రి వద్దకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులు, వైద్యులతో చర్చించారు. ఆందోళన విరమింపజేయడంతో వివాదం సర్దుమణిగింది.

టైమ్‌లైన్‌పై రైతులకు అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థినులు శనివారం చాగంటివారిపాలెం గ్రామ రైతులకు టైమ్‌లైన్‌పై అవగాహన కల్పించారు. కళాశాల కీటకశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ సి.సంధ్యారాణి మాట్లాడారు. గ్రామ చరిత్ర, చపాలిపటం, కాలానుగుణ పటం, గ్రామంలోని సన్నకారు, కౌలు, పెద్ద రైతులు, పాఠశాలలు తదితర అంశాలను తెలియపరిచేలా రంగులు వేసి రైతులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సీహెచ్ పావని, సీహెచ్ దీప్తి, ఎ.దివ్య, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని క్వారీ పరిశీలన



రాజుపాలెం: అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. మండలంలోని కొండమోడు సమీపంలో గల పులిచింతల నిర్వాసితుల కేంద్రం సమీపంలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారని తహసీల్దారు, సిబ్బందికి సమాచారం రావడంతో శనివారం పరిశీలించారు. ఆ ప్రదేశంలో జేసీబీ ఉండడంతో సీజ్ చేశారు. బాధ్యులపై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. గ్రామ సర్వేయర్ వెంకటేశ్వర్లు కొలతలు తీసుకుని ఇక్కడి క్వారీకి అనుమతులు లేవని తెలిపారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ వంశీకృష్ణ, వీఆర్వో తులసి తదితరులు ఉన్నారు.

రామారావు మృతి తీరని లోటు

సత్తెనపల్లి: ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావు మృతి ఆర్టిస్టు లోకానికే తీరని లోటు అని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. శనివారం రామారావుకు ఆయన నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. రామారావు కుటుంబ సభ్యులకు సినీ హాస్యనటుడు బ్రహ్మానందం కూడా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాల్య స్నేహితుడైన మారూరి పుల్లారెడ్డికి ఫోన్ చేసి, రామారావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలాగే పలువురు ప్రముఖులు జింకా భౌతికకాయం వద్ద ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయాల్లో మార్మోగిన శివ నామస్మరణ




పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో గల శివాలయంలో పూజ చేస్తున్న భక్తులు



నర్సింగపాడులోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు

సత్తెనపల్లి: పవిత్ర కార్తిక మాసం ప్రారంభం కావడంతో శివాలయాలు శనివారం భక్తజనంతో కిటకిటలాడాయి. భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు, మారేడు పత్రాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష బిల్వార్చనలు, ఆవు నేతి వత్తులతో దీపారాధనలు ఆచరించారు. తమను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. శైవక్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. శివనామస్మరణతో మారుమోగాయి. దీపాల వెలుగులో ఆలయాలు శోభను సంతరించుకున్నాయి. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల శ్రీ దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, త్రిశక్తి దుర్గాపీఠం, పెదమక్కెన గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం, కట్టావారిపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, పలు శైవక్షేత్రాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కార్తిక మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తిక పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గురు ప్రార్థనతో పూజలను ప్రారంభించారు. అమ్మవారిని, స్వామి వారిని విశేషంగా అలంకరించారు. రుద్ర హోమం తదితరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. విశేష అలంకరణలో ఉన్న స్వామివార్లను దర్శించుకొని, మొక్కులు చెల్లించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు 12 మంది ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పెదకూరపాడు (అమరావతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలలో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి 12 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన పెదకూరపాడు జీఆర్‌సీ ఆర్‌కే శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులను యాజమాన్యం, గ్రామస్తులు అభినందించారు. శనివారం పాఠశాలలో క్రీడాకారులను డైరెక్టర్ గుత్తా కవిత రాములు ప్రత్యేకంగా అభినందించారు. అండర్ - 14 వంద మీటర్ల రన్నింగ్‌లో గుండ హన్సిక, కబడ్డీలో చేజర్ల సానియా ముస్కాన్, అండర్ - 17 విభాగంలో గురజాల పూజిత, దూళ్ల బ్రహ్మం, వాలీబాల్‌లో అండర్ 17 విభాగంలో సాదినేని నేహా, పమిడాల తన్వి, అవ్వారి దుర్గ అక్షర, వాలీబాల్ అండర్ -14లో వేమాల చరిత, బాలుర విభాగంలో వేముల ప్రదీప్, వేముల జశ్వంత్, దూళ్ల బ్రహ్మం, అనుముల వరుణ్ కుమార్, కొండవీటి భువన్ సాయి తదితరులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. శిక్షకులు అబూబాకర్, తిరుపతి రెడ్డిలను పాఠశాల కరెస్పాండెంట్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గురజాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన లోకసాని నాగిరెడ్డి (38) అంబాపురం నుంచి గురజాలకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలో వాగ్దేవి కళాశాల వద్ద బైపాస్ నుంచి దిగుతుండగా ముందుగా వెళ్తున్న టిప్పర్‌ను అధిక వేగంతో వచ్చి ఢీకొట్టాడు. టిప్పర్ వెనుకభాగం నాగిరెడ్డి తలకు గట్టిగా తగలడంతో అక్కడిక్కడే కిందపడిపోయి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

మాచవరం పీహెచ్‌సీలో తనిఖీలు



మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ పరిసరాలను, ఫార్మసీలోని మందులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో తనిఖీలు చేపట్టి , రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎంల పనితీరును పరిశీలించి, తగు సూచనలు అందించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.